
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం ‌। 20 ‌। మే ‌। 2025



సోమశిలలో 45.977 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం 45.977 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 4,300, ఉత్తర,దక్షిణ కాలువలకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.96,550
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,755
3శాతం జీఎస్టీతో	రూ.9,018
నవర (8గ్రా)	రూ.72,144

గరిష్టం/కనిష్టం
31.5 /25.9

వాతావరణం

జిల్లాలో కొన్నిచోట్ల మంగళవారం మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 91 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

వైభవంగా శేషవాహన సేవ



శేషవాహనంపై విహరిస్తున్న మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి, అమ్మవారు శేష వాహనంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు దేవదేవేరులను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.

మెప్మా పీడీగా లీలారాణి



బాధ్యతలు స్వీకరిస్తున్న లీలారాణి

నెల్లూరు (బారకాసు): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) నెల్లూరు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా డిప్యూటీ కలెక్టర్ బి.లీలారాణి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో లీలారాణి సోమవారం మెప్మా పీడీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పీడీగా ఉన్న రాధమ్మ తిరిగి చిత్తూరు జిల్లా మెప్మా పీడీగా బదిలీ అయ్యారు. లీలారాణి గతంలో జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్‌గా, గూడూరు, కోట, బోగోలు, సైదాపురం తహసీల్దార్‌గా పని చేశారు. ప్రస్తుతం రాజంపేట భూసేకరణ విభాగంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై నెల్లూరు మెప్మాగా పీడీగా నియమితులయ్యారు.

నెల్లూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు షురూ

- నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

నెల్లూరు (లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. సోమవారం ఎన్నికల అధికారి బి.శ్రీనివాసన్ నోటిఫికేషన్ జారీ చేశారు. మంగళవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై 26వ తేదీతో ముగుస్తుంది. 27న నామినేషన్ల పరిశీలన, 30న ఉపసంహరణ అనంతరం అర్హులైన అభ్యర్థుల జాబితాను అదే రోజు ప్రకటిస్తారు. జూన్ 20వ తేదీ ఉదయం నుంచి ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది. అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఎటువంటి ఘర్షణలకు తావివ్వకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ఎన్నికలు సక్రమంగా నిర్వహించే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

బండలాగుడు పోటీల్లో బల్లికురవ ఎడ్లు విజేత



బండ లాగుతున్న ఎడ్లు

సీతారామపురం: మండలంలోని సంగసానిపల్లిలో కొలువైన కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఎడ్లతో బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి ఎడ్లు 19 నిమిషాల్లో 1,600 మీటర్లు బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అతనికే చెందిన మరో జత ఎడ్లు 16.6 నిమిషాల వ్యవధిలో 1,200 మీటర్లు బండలాగి ద్వితీయ స్థానంలో నిలువగా, ప్రకాశం జిల్లా బేస్తవారిపేట జేసీ అగ్రహారానికి చెందిన లక్కునాగ శివశంకర్ ఎడ్లు 20 నిమిషాల వ్యవధిలో 1,016.7 మీటర్లు బండలాగి తృతీయ స్థానంలో నిలిచాయి. కోదండరామస్వామి భక్త బృందం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎడ్ల యజమానులకు రూ.50,000, రూ.30,000, రూ.20,000 చొప్పున నగదు బహుమతులను అందజేశారు.

సెలవులో జేసీ

నెల్లూరు రూరల్: జిల్లా జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ సెలవుపై వెళ్లనున్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఆయన మంగళవారం నుంచి వారం రోజులపాటు సెలవులో ఉంటారు. అనంతరం తిరిగి విధుల్లో చేరనున్నారని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

మెగా మోసమేనా!

మెగా డీఎస్సీ పోస్టింగ్‌లపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. తొలి సంతకంతో ఔత్సాహిక ఉపాధ్యాయుల్లో ఆశలు రేకెత్తించిన టీడీపీ ప్రభుత్వం ఏడాది కాలంగా కాలయాపన చేస్తూ వచ్చింది. ఎట్టకేలకు డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాక అర్హతలపై అనేక కొర్రీలు పెట్టారు. తాజాగా పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ చేపట్టి మిగులు ఉపాధ్యాయుల లెక్కలు తేల్చారు. వీరినే కూర్చోబెట్టి జీతాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉన్న నేపథ్యంలో డీఎస్సీలో కొత్తగా వచ్చే ఉపాధ్యాయులకు ఎక్కడ పోస్టింగ్‌లు ఇస్తారనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. 2025 డీఎస్సీ.. 1998 నాటి డీఎస్సీ మాదిరిగా గ్రహణం పట్టే పరిస్థితులు ఉంటాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



- ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 673 పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్
- తాజాగా పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణలో 700కు పైగా మిగులు ఉపాధ్యాయులు
- 673 పోస్టులకు 28,772 దరఖాస్తులు
- ఒక్కో పోస్టుకు 43 మంది అభ్యర్థులు పోటీ
- వచ్చే నెల 6వ తేదీ నుంచి డీఎస్సీ పరీక్షలు

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలనుకునే నిరుద్యోగుల ఆశలు.. అడియాశలుగానే మిగిలిపోయే పరిణామాలు కనిపిస్తున్నాయి. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా అప్పులు చేసి కోచింగ్‌లు తీసుకుని, ఏళ్ల తరబడి ఎదురు చూసిన ఔత్సాహిక ఉపాధ్యాయుల కలలు కల్లలు అవుతాయనే ఆందోళన డీఎస్సీకి సిద్ధమవుతున్న వారిలో కనిపిస్తోంది. ప్రభుత్వ తీరు, పరిస్థితులు చూస్తుంటే అసలు పోస్టింగ్‌లు వస్తాయా? వచ్చినా ఎప్పుడొస్తాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ ప్రభుత్వ వ్యవహార శైలి చూస్తుంటే.. పోస్టింగ్‌లపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

మెగా కాదు.. మినీ డీఎస్సీ

మెగా డీఎస్సీ అంటే ఎక్కువ పోస్టులు ఉంటాయని ఎదురు చూసిన నిరుద్యోగుల ఆశలపై ఆదిలో కూటమి ప్రభుత్వం నీళ్లు కొట్టింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాకు కేవలం 673 పోస్టులను మాత్రమే కేటాయించింది. అందులోనూ ఎస్జీటీ పోస్టులు కేవలం 117 మాత్రమే ఉన్నాయి. సాధారణంగా ఎస్జీటీ పోస్టులకు ఎక్కువ మంది పోటీ పడతారు. ఈ పోస్టుల సంఖ్య రాష్ట్రంలో ఇతర జిల్లాలతో పోలిస్తే నెల్లూరు జిల్లాకు బాగా తక్కువనే చెప్పాలి. దీన్ని బట్టి చూస్తే ఇది మెగా డీఎస్సీ కాదు..మినీ డీఎస్సీ అని స్పష్టమవుతోంది.

స్కూల్ కాంప్లెక్స్‌కు సర్దుబాటు



మిగులు స్కూల్ అసిస్టెంట్లను జిల్లాలోని ఆయా స్కూల్ కాంప్లెక్స్‌లకు ముగ్గురు నుంచి నలుగురును సర్దుబాటు చేసే ప్రతిపాదన ఉంది. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెలవు పెట్టినప్పుడు వీరిని అక్కడకు పంపిస్తారు. డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన కొంత మందిని కూడా స్కూల్ కాంప్లెక్స్‌లకు పంపించే అవకాశం ఉంది. దీనిపై ఇప్పటి వరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారుల నుంచి ఎలాంటి మార్గదర్శకాలు అయితే రాలేదు.

– బాలాజీరావు, డీఈఓ

1998 డీఎస్సీ మాదిరిగా అవుతుందా?

చంద్రబాబు సీఎంగా ఉన్న 1998లో కూడా ఇలానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. ఆ సమయంలో కూడా ఇలానే మిగులు ఉపాధ్యాయుల లెక్కలు తేల్చి చివరకు.. కటాఫ్ మార్కులను తగ్గించారు. దీంతో ఇంటర్వ్యూల్లో నిష్పత్తి శాతం పెరిగింది. అన్ని దశల్లోనూ క్వాలిఫై అయినా.. అప్పట్లో ఉద్యోగాలు ఇవ్వకుండా పెండింగ్ పెట్టారు. దీనిపై అభ్యర్థులు కోర్టుకెళ్తే.. ఆ కోర్టును కూడా తప్పుదోవ పట్టించి, అందరికీ ఉద్యోగాలిచ్చామని మోసం చేసిన చరిత్ర ఈ టీడీపీ ప్రభుత్వానికి ఉంది. అయితే ఆ తర్వాత వైఎస్సార్ హయాంలో తిరిగి నిర్వహించిన డీఎస్సీల్లో కొందరు ఉద్యోగాలు పొందారు. అప్పటి నుంచి పోరాటం చేస్తూనే ఉన్న కొందరికి గత ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉద్యోగాలు కల్పించడం గమనార్హం. తాజా డీఎస్సీ పరిస్థితులు చూస్తుంటే.. 1998 నాటి డీఎస్సీ పరిణామాలు గుర్తుకు వస్తున్నాయి. పరీక్షలు నిర్వహించినా, ఇంటర్వ్యూలు పూర్తి చేసినా.. క్వాలిఫై అయిన వారికి పోస్టింగ్‌లు ఇచ్చే వరకు అనుమానాలే అని ఉపాధ్యాయులు గుర్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 673 పోస్టులకు 15,993 మంది అభ్యర్థులు 28,772 దరఖాస్తులు ఆయా పోస్టులకు చేసుకున్నారు. అంటే కొంత మంది అభ్యర్థులు రెండు లేదా మూడు పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ లెక్కన ఒక్కో పోస్టుకు 43 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఏ శాఖలో ప్రభుత్వ ఉద్యోగాలు లేక పోవడంతో ఉపాధ్యాయ పోస్టులకు డిమాండ్ పెరిగింది. పురుషులు 6,173 మంది దరఖాస్తు చేసుకోగా మహిళలు 9,820 మంది దరఖాస్తు చేసుకున్నారు.

673 పోస్టులకు 28,772 దరఖాస్తులు



డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులు

ఉపాధ్యాయ పోస్టుల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా పోటీ పడుతుండడం విశేషం. వచ్చే నెల 6వ తేదీ నుంచి డీఎస్సీ పరీక్షలను నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెలాఖారులో అభ్యర్థులకు హాల్ టికెట్లును అందజేయనున్నట్లు వెల్లడించింది.

700 స్కూల్ అసిస్టెంట్ల పోస్టులు మిగులు

జిల్లాలో ఇటీవల చేపట్టిన పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో 700కు పైగా స్కూల్ అసిస్టెంట్ల పోస్టులు మిగులు ఉన్నట్లు లెక్కలు తేల్చారు. ప్రస్తుతం వీరికే ఎక్కడ పోస్టింగ్‌లు ఇవ్వాలో తెలియని పరిస్థితి. వీరందరిని కూర్చోబెట్టి జీతాలు ఇవ్వాల్సి ఉంటుంది. కొత్తగా 2025 డీఎస్సీలో 673 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. మరి డీఎస్సీలో క్వాలిఫై అయిన వీరందరికీ ఎక్కడ పోస్టింగ్ ఇస్తారని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ 673 పోస్టుల్లో కూడా 117 మాత్రమే ఎస్జీటీ పోస్టులు ఉన్నాయి. మిగిలిన 556 పోస్టుల్లో స్కూల్ అసిస్టెంట్లు ఉంటారు. ఇప్పటికే సీనియార్టీ ఉన్న ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెక్కన మిగులుగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లు 700 మందితోపాటు కొత్తగా రిక్రూట్ అయితే వచ్చే 556 మంది, ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లు పదోన్నతి పొందే వారందరికీ పోస్టులు ఎక్కడ ఇస్తారు, ఏ విధంగా వినియోగించుకుంటారనే ప్రశ్నలకు జిల్లా విద్యాశాఖాధికారుల వద్ద సరైన సమాచారం లేదు.

లీజు గడువు తీరిన మైన్లు స్వాధీనం చేసుకోవాలి

- రాష్ట్ర సంగీత అకాడమీ మాజీ చైర్‌పర్సన్ పొట్టేళ్ల శిరిషా



కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదు చేస్తున్న శిరిషా

నెల్లూరు రూరల్: సైదాపురం మండలంలో 50 ఏళ్ల లీజు గడువు ముగిసిన మైకా గనులు 8 ఉన్నాయని, వాటిని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని జెడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్, రాష్ట్ర సంగీత అకాడమీ మాజీ చైర్‌పర్సన్ పొట్టేళ్ల శిరిషా డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ప్రభుత్వ గనుల శాఖ ఈ కార్డ్స్‌ను మేజర్ మినరల్స్ కింద కేటాయించిందన్నారు. ఎంఎండీఆర్ చట్టం 1957 ప్రకారం అక్రమ మైనింగ్ చేయకూడదన్నారు. అయితే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అతని అనుచరుడు యథేచ్ఛగా అక్రమ మైనింగ్ చేస్తున్నారన్నారు. పర్యావరణ క్లియరెన్స్ లేకుండా ఎటువంటి మైనింగ్ చేపట్టకూడదని సుప్రీంకోర్టు 2017లో 114 పేజీలతో జస్టిస్ దీపక్ గుప్తా ధర్మాసనం జడ్జిమెంట్ ఇచ్చిందని గుర్తు చేశారు. బాధ్యత గల ఎంపీ స్థానంలో ఉండి సుప్రీం ఆదేశాలను ధిక్కరిస్తూ అక్రమ మైనింగ్ చేస్తుంటే ఇంతకన్నా దారుణం ఎక్కడ ఉండదన్నారు. ఈ అక్రమ మైనింగ్‌పై జిల్లా మైనింగ్ డీడీ బాలాజీనాయక్‌కు ఫిర్యాదు చేసినా, బ్లాస్టింగ్ చేసి అక్రమ మైనింగ్ చేస్తుంటే సంబంధం లేనట్లు డీడీ వ్యవహరించడం తగదన్నారు. ఐబీఎం రూల్స్‌ను అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును లెక్క చేయకుండా ఈ మాఫియా బరి తెగించి యథేచ్ఛగా అక్రమ మైనింగ్ చేస్తుందన్నారు. తక్షణమే లీజు గడువు ముగిసిన ఈ గనులను స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎంఎండీఆర్ చట్టం 1957 ప్రకారం సిద్ధి వినాయక, కేఎస్ఆర్ అండ్ కంపెనీ, శోభరాణి, భరత్‌బాబు, వీకే డీఎం కనకదుర్గ, జయలక్ష్మి మీనాక్షి సుందరం, రుస్తుం, మైకా మైన్స్‌లను వెంటనే స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కట్టుదిట్టంగా ఏపీ ఈఏపీ ప్రవేశపరీక్ష

- 92.40 శాతం మంది విద్యార్థులు హాజరు

నెల్లూరు (టౌన్): ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఏపీ ఈఏపీ ప్రవేశ పరీక్ష తొలిరోజు సోమవారం కట్టుదిట్టంగా నిర్వహించారు. ఈ పరీక్ష రెండు సెషన్లల్లో జిల్లాలో 5 సెంటర్లలో జరిగింది. ఉదయం జరిగిన పరీక్షకు 687 మంది విద్యార్థులకు 625 మంది హాజరయ్యారు. 62 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షకు 695 మందికి 652 మంది హాజరు కాగా, 43 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 92.40 శాతం హాజరు నమోదైంది. విద్యార్థులతోపాటు వచ్చిన తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాల వద్ద పడిగాపులు కాశారు.

పది అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు 454 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 38 సెంటర్లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరిగింది. 1,343 మంది విద్యార్థులకు గానూ 889 మంది హాజరయ్యారు. 454 మంది గైర్హాజరయ్యారు. 23 కేంద్రాల్లో డీఈఓ బాలాజీరావు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు.

22న పెంచలకోనలో హనుమజ్జయంతి



రాపూరు: పెంచలకోనలో ఈనెల 22వ తేదీన హనుమజ్జయంతిని నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు సోమవారం తెలిపారు. ఉదయం 5 గంటలకు క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి అభిషేకం, పూలంగి సేవ, 10.30 గంటలకు ఆకుపూజ, సాయంత్రం తిరుచ్చిపై ఆంజనేయస్వామి ఊరేగింపు ఉంటుందని వెల్లడించారు.

దగదర్తి వైస్ ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవం

- స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ కుడుముల చిన్నమ్మ




చిన్నమ్మకు నియామకపత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి

దగదర్తి: వైస్ ఎంపీపీకి సోమవారం జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి ఉలవపాళ్ల ఎంపీటీసీగా ఉన్న కుడుముల చిన్నమ్మ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఏకగ్రీవంగా గెలుపొందారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుబ్బరాజు వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. మండలంలో మొత్తం 11 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా అందరూ వైఎస్సార్‌సీపీ తరపున గెలుపొందిన వారే. టీడీపీకి ఒక్క ఎంపీటీసీ కూడా లేరు. ప్రస్తుతం ఎంపీపీగా తాళ్లూరు ప్రసాద్‌నాయుడు ఉన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన 11 మంది ఎంపీటీసీ సభ్యుల్లో ఇద్దరు వైస్ ఎంపీపీలుగా ఎన్నికయ్యారు. వీరిలో పీతల కామేశ్వరికి ప్రభుత్వ ఉద్యోగం రావడంతో ఆ పదవికి రాజీనామా చేయడంతో ఉపాధ్యక్ష ఎన్నిక అనివార్యమైంది. గతంలో నిర్వహించ తలపెట్టిన ఎన్నిక రెండు సార్లు వాయిదా పడింది. ఈ క్రమంలో చెన్నూరు ఎంపీటీసీ చలంచర్ల సుశీల ఇటీవల టీడీపీ కండువా కప్పుకున్నారు. అయితే తాజాగా వైస్ ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో సోమవారం ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న 10 మంది ఎంపీటీసీ సభ్యుల్లో ఎనిమిది మంది సభ్యులు హాజరయ్యారు. వీరిలో ఉలవపాళ్ల ఎంపీటీసీ సభ్యురాలు కుడుముల చిన్నమ్మ వైస్ ఎంపీపీ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. పోటీకి ఎవరు ముందుకు రాకపోవడంతో చిన్నమ్మ ఏకగ్రీవంగా గెలుపొందినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. అనంతరం ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్రతి అర్జీని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలి

- గృహ నిర్మాణాల్లో వేగం పెంచాలి
- ఉపాధి హామీ పనులు ముమ్మరం చేయండి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆనంద్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే అర్జీలను నిర్దిష్ట వ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ ఓ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్ నుంచి సబ్‌కలెక్టర్లు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో పరిష్కరించిన అర్జీలపై అర్జీదారుల నుంచి సంబంధిత సచివాలయాల సిబ్బంది అభిప్రాయాలు తెలుసుకుని రిపోర్టు అందించాలని, ఈ విషయమై ఎంపీడీఓలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రతి వారం వచ్చే అర్జీల్లో 60 శాతం రెవెన్యూ సమస్యలపైనే వస్తున్నాయన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తూ ఎండార్స్‌మెంట్‌తోపాటు తగిన ఆధార పత్రాలను అప్‌లోడ్ చేయాలన్నారు. ఉపాధి హామీ పనుల వేగం పెంచాలని, ప్రతి వారం కనీసం 70 శాతం తగ్గకుండా పనులు జరిగేలా ఎంపీడీఓలు, ఏపీఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పేదల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తుందని, దశల వారీగా నిర్మాణాల్లో వేగం పెంచి పూర్తి చేయాలన్నారు. పీఎం సూర్యఘర్ యోజన పథకం ఏర్పాటుపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఉదయభాస్కర్, జెడ్పీ సీఈఓ విద్యారమ, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య, ఐటీడీఏ పీఓ మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వాహనాల బీభత్సం



జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా పడిన లారీని తొలగిస్తున్న క్రేన్



వెనుకనే వస్తూ అదుపు తప్పిన భారీ ట్రక్, కారు

- అదుపు తప్పి బోల్తాపడిన లారీ
- వెనుకనే వస్తూ ఢీకొన్న కారు, భారీ ట్రాలీ
- స్వల్పగాయాలతో బయటపడిన డ్రైవర్లు, ప్రయాణికులు

దగదర్తి : మండలంలోని అల్లూరు రోడ్డు రైల్వే వంతెన వద్ద సోమవారం తెల్లవారుజామున మూడు వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో బీభత్సంగా మారింది. అయితే ఆయా వాహనాల డ్రైవర్లు, ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడడంతో పెను ప్రమాదం తప్పినట్లు అయింది. వివరాల్లోకి వెళ్తే.. అల్లూరు రోడ్డు వద్ద రైల్వే వంతెన ప్రాంతంలో గతం నుంచి రెండు లేన్ల జాతీయ రహదారి ఉంది. అయితే రహదారి విస్తరణలో కొత్తగా మరో రెండు లేన్లను కొత్తగా నిర్మించారు. ప్రస్తుతం అక్కడ నాలుగులేన్ల జాతీయ రహదారి ఉంది. అయితే పాత రెండు లేన్ల రహదారి (నెల్లూరు నుంచి కావలి వైపు వెళ్లే దారి)లో వంతెన బలహీనంగా ఉందని 12 ఏళ్ల క్రితమే ఆ మార్గాన్ని మూసివేశారు. కొత్తగా నిర్మించిన రెండు లేన్ల రహదారినే ఇరువైపుల వాహనాల రాకపోకలను కొనసాగిస్తున్నారు. ఈ వంతెనకు అటు, ఇటు నుంచి ఆరు లేన్ల రహదారి ఉంది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులకు అక్కడికి వచ్చే వరకు రహదారి సింగిల్ లేన్ ఉన్న విషయం తెలియదు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారు జామున అతివేగంగా వచ్చిన ఓ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. అదే సమయంలో వెనుకనే వేగంగా వస్తున్న ఓ కారు, దాని వెనుకనే వస్తున్న భారీ ట్రాలీ ఢీకొనడంతో బీభత్సంగా మారింది. అయితే ఈ ప్రమాదంలో ఆయా వాహనాల్లోని డ్రైవర్లు, ప్రయాణికులకు స్వల్పగాయాలు కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదాల కారణంగా ఈ మార్గంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హైవే సిబ్బందితో పాటు పోలీసులు అక్కడికి చేరుకుని క్రేన్ల సహాయంతో బోల్తాపడిన వాహనాన్ని పక్కకి తప్పించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

అటవీశాఖ అదుపులో గుప్తనిధి తవ్వకాల ముఠా సభ్యుడు

ఉదయగిరి: అటవీశాఖ అధికారులు గుప్తనిధి తవ్వకాలు సాగించే ముఠాలోని ఓ సభ్యుడిని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని బండగానిపల్లి రోడ్డు మార్గంలో ఉన్న దుర్గం కొండపై గుప్త నిధుల తవ్వకాల కోసం సోమవారం ఓ ముఠా బయలుదేరిన సమాచారంతో అటవీ సిబ్బంది చిన్నవెంకటయ్య, ప్రసన్న, భానుతేజ బృందం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అటవీ ప్రాంతంలో ఉన్న రాణిబావి సమీపంలో ముగ్గురు వ్యక్తులు సామగ్రితో సిబ్బంది కంట పడ్డారు. వారిని పట్టుకునే ప్రయత్నంలో ఒకరు పట్టుబడగా, మరో ఇద్దరు పరారయ్యారు. పట్టుబడిన వ్యక్తిని విచారించగా వరికుంటపాడు మండలం తూర్పుబోయమడుగుల ఎస్టీ కాలనీకి చెందిన నల్లు అశోక్‌గా గుర్తించారు. పరారీలో ఉన్నవారు మర్రిపాడు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన రమేష్, గోపీలుగా నిర్ధారించారు. అశోక్‌ను ఉదయగిరిలోని అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు. మంగళవారం కోర్టులో హాజరుపరుస్తామని రేంజర్ కుమార్‌రాజా తెలిపారు.

బోలెడు సమస్యలు వినతులు

- నెల్లూరులో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- 385 వినతుల అందజేత
- హామీలు నెరవేర్చాలంటూ సీపీఐ ధర్నా
- ఆదుకోవాలని కేబుల్ ఆపరేటర్ల వినతి


వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు

నెల్లూరు రూరల్: నెల్లూరులోని కలెక్టరేట్‌లో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వినతులు వెల్లువలా వస్తున్నాయి. సోమవారం తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ఆనంద్, జేసీ కె.కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కర్‌రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ విద్యారమ సమస్యలు తెలుసుకున్నారు. వారికి 385 వినతులందాయి. వాటిలో రెవెన్యూ శాఖవి 170, మున్సిపల్ శాఖవి 30, సర్వేవి 32, పంచాయతీరాజ్‌వి 23, పోలీస్ శాఖవి 49, సివిల్ సప్లయ్స్‌వి 17 తదితర శాఖలవి ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలందించిన అర్జీల విషయంలో జాప్యం లేకుండా వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

భూ ఆక్రమణపై..

సీతారామపురం మండలం దేవిశెట్టిపల్లి గ్రామ సర్వే నంబర్ 86–3లో 2.86 ఎకరాలను నాగరాజుపల్లి, దేవిశెట్టిపల్లి గ్రామాలకు సంబంధించి పశువులు, గొర్రెలు మేపుకొనేందుకు వినియోగిస్తారని, అయితే మారంపల్లి గ్రామానికి చెందిన ఇర్ల నాగయ్య అనే వ్యక్తి ఆ భూమిని ఆక్రమించాడని దేవిశెట్టిపల్లి గ్రామ సర్పంచ్ రేనాటి మహేశ్వరి వినతిపత్రం సమర్పించారు. ఆమె మాట్లాడుతూ మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని, అతను నకిలీ పాస్ పుస్తకాలు, ధ్రువీకరణపత్రాలతో అక్రమంగా కరెంట్ సర్వీస్ కూడా పొందినట్లు తెలిపారు. తాము హైకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

గ్రామ కార్యదర్శి మల్లికార్జున అగౌరవపరుస్తున్నాడని సంగం మండలం అన్నారెడ్డిపాళెం సర్పంచ్ మోడేగుంట శేషమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ తాను ఎస్సీనని, 8 నెలలుగా ఏ తీర్మానం చేయకుండా అడ్డుకుంటున్నాడని తెలిపారు. చేసిన పనులకు ఎం బుక్‌లిచ్చినా బిల్లుల చెల్లింపులు చేయడం లేదన్నారు. ఇంటి పన్ను వసూళ్లను తనకు తెలియకుండా చేస్తున్నాడన్నారు. పంచాయతీలో అక్రమాలకు పాల్పడుతున్నాడని అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హామీలు నెరవేర్చాలని డిమాండ్

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు షాన్‌వాజ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ, నగరవాసులకు రెండు సెంట్లు ఇస్తామని, అదే విధంగా ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు అర్హులకు ఎక్కడా భూములిచ్చిన దాఖలాల్లేవన్నారు. నిబంధనలు పెట్టకుండా గత ప్రభుత్వం ఎలాగైతే రేషన్‌కార్డులు మంజూరు చేసిందో అదే విధంగా ఇప్పుడు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముక్తియార్, వి.రామరాజు, యామాల మధు, సుబ్బారాయుడు, శిరీష, లత పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఉద్యోగులపై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలన్నారు. డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. నాయకులు పఠాన్ బాజీ, కరిమి రాజేశ్వరరావు, చీర్ల కిరణ్‌కుమార్, హుస్సేన్, ధనరాజ్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

కేబుల్ ఆపరేటర్లను ఆదుకోవాలంటూ..

ఫైబర్ నెట్ సంస్థ నిర్వహణ లోపం కారణంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ మల్టీ సర్వీసెస్ కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం నేతలు చెప్పారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్రాధ్యక్షుడు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఏడునెలల నుంచి సిగ్నల్స్ అంతరాయంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. వినియోగదారులు తగ్గడంతో ఆర్థికంగా నష్టపోయి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని తెలిపారు. టెక్నికల్ సిబ్బందిని తొలగించడం, ఇతరులను నియమించకపోవడం కేబుల్ ఆపరేటర్ల మెడపై కత్తిని వేలాడదీసినట్లే భావించాల్సి ఉంటుందన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి చొరవ చూపలేదన్నారు.


మాట్లాడుతున్న కేబుల్ ఆపరేటర్లు

ఆస్తి కోసం వేధిస్తున్నారయ్యా..

- ఫిర్యాదు చేసిన పలువురు వృద్ధులు
- ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- 97 వినతుల అందజేత


బాధితుల సమస్యను వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన పిల్లలు ఆస్తి కోసం వేధిస్తున్నారు. మరికొందరు ఏకంగా ఇంట్లో నుంచి గెంటేస్తున్నారు. వృద్ధులు తమ బాధలను పోలీసుల దృష్టికి తీసుకొస్తున్నారు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 97 మంది విచ్చేసి వివిధ సమస్యలపై జి.కృష్ణకాంత్‌కు వినతిపత్రాలు సమర్పించారు. వాటిని పరిశీలించిన ఆయన సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ చెంచురామారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్‌బీ – 2 ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాపం వృద్ధులు

- నా ఆస్తులను కుమారుడు లాక్కొని ఇంట్లో నుంచి గెంటేశాడు. తెలిసిన వారింట్లో తలదాచుకుంటున్నాను. విచారించి న్యాయం చేయాలని కొండాపురం ప్రాంతానికి చెందిన ఓ వృద్ధురాలు కోరారు.
- నా కుమారుడు ఐదేళ్ల క్రితం చనిపోయాడు. మనవడు, కోడలు ఆస్తి కోసం తీవ్రంగా కొడుతున్నారు. వారి బారి నుంచి రక్షణ కల్పించాలని బుచ్చిరెడ్డిపాళెం ప్రాంతానికి చెందిన ఓ వృద్ధురాలు ఫిర్యాదు చేశారు.
- నా కుమారులకు ఆస్తిని సమంగా పంచాను. పెద్ద కుమారుడు నా పేరుపై ఉన్న ఇంటిని కూడా తనకు ఇవ్వాలని వేధిస్తున్నాడని నెల్లూరు రూరల్ మండలానికి చెందిన ఓ వృద్ధుడు వినతిపత్రం ఇచ్చాడు.

ఫిర్యాదుల్లో మరికొన్ని..

- ఫ్రెండ్ యాప్‌లో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. ప్లాట్ల వ్యాపారం చేద్దామని నమ్మించి రూ.6,27,900లు తీసుకుని మోసగించాడని సైదాపురానికి చెందిన ఓ మహిళ కోరారు.
- హైదరాబాద్‌కు చెందిన కుమార్, చంద్రమోహన్‌లు ఆన్‌లైన్‌లో పరిచయమయ్యారు. హాంకాంగ్‌కు చెందిన ట్రేడింగ్ కంపెనీలో రూ.కోటి పెట్టుబడి పెడితే 500 మిలియన్ డాలర్లు వస్తాయని నమ్మించి నగదు తీసుకుని మోసగించారు. నగదు అడిగితే రౌడీలతో చంపిస్తామని బెదిరిస్తున్నారని బాలాజీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- నెల్లూరు బాలాజీనగర్‌కు చెందిన సన్నీ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి లోబర్చుకున్నాడు. పెళ్లి చేసుకోవాలని అడిగితే ముఖం చాటేస్తున్నాడు. తగిన చర్యలు తీసుకోవాలని బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఓ యువతి కోరింది.
- ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని బాపట్లకు చెందిన మహేష్ నా వద్ద రూ.13 లక్షల నగదు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా నగదు అడిగితే చంపుతామని బెదిరిస్తున్నాడంటూ కోవూరు చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశాడు.
- సౌత్‌మోపూరుకు చెందిన కృష్ణారెడ్డి నకిలీ కన్సల్టెన్సీ పెట్టి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి నా వద్ద, స్నేహితుడి వద్ద రూ.5 లక్షల నగదు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించలేదు. నగదు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వేదాయపాళేనికి చెందిన ఓ వ్యక్తి వినతిపత్రం ఇచ్చాడు.

కాలువలో పడి వృద్ధుడి మృతి


రామానాయుడు మృతదేహం

సంగం: ఓ వృద్ధుడు కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువ వద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అన్నారెడ్డిపాళేనికి చెందిన కిలారి రామానాయుడు (80) కొన్నేళ్లపాటు ఆత్మకూరు మండలం అప్పారావుపాళెంలో నివాసం ఉన్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. మూడు నెలలుగా మండల కేంద్రమైన సంగం పంచాయతీ మజరా అమరపునాయుడు కండ్రికలోని ల్యాంకో ఫౌండేషన్ ఆశ్రమంలో ఉంటున్నాడు. సోమవారం ఆశ్రమం బయటకు వచ్చిన రామానాయుడు సమీపంలో ఉన్న కనిగిరి రిజర్వాయర్ ప్రధాన కాలువ వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. ఈ క్రమంలో నీటిలో మునిగిపోయాడు. ఆశ్రమానికి వృద్ధుడు తిరిగి రాకపోవడంతో నిర్వాహకులు కాలువ వద్ద చూశారు. రామానాయుడు చేతి కర్ర కనిపించింది. దీంతో సంగం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై రాజేష్ కాలువలో గాలింపు చర్యలు చేపట్టగా కాలువలో రామానాయుడు మృతదేహం కనిపించింది. దానిని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరుకు తరలించారు.

దళిత విద్యార్థి జేమ్స్‌కు ఎమ్మెల్సీ పరామర్శ


జేమ్స్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరులోని షైన్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌ను వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జేమ్స్‌పై దాడి ఘటన విషయాన్ని తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే పరామర్శించి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆదేశించడంతో వైద్యులతో మాట్లాడినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇలాంటి దాడులు విచ్చలవిడిగా జరుగుతున్నాయన్నారు. ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కూటమి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 130
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 234
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 260
లేయర్ చికెన్	: 187



పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.45
పండ్లు	: రూ.25



ఆగని కోళ్ల వ్యర్థాల తరలింపు

- నాలుగు మినీ లారీల పట్టివేత


పోలీసులు పట్టుకున్న మినీలారీ

సంగం: మండలంలో పలుచోట్ల సోమవారం నాలుగు మినీలారీల్లో తరలిస్తున్న 45 డ్రమ్ముల కోళ్ల వ్యర్థాలను గ్రామీణుల సహాయంతో పోలీసులు పట్టుకున్నారు. వారి కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం నుంచి సంగంకు మినీలారీలు వచ్చాయి. దువ్వూరులో రెండు, సంగం కావలి కాలువ వద్ద ఒకటి, బ్యారేజ్ వద్ద మరొకటి చికెన్ వ్యర్థాలను తరలించేందుకు వెళ్తుండగా ఆయా గ్రామాల్లోని యువకులు అడ్డగించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు కొండమలుపు సమీపంలోని పంపింగ్ స్కీం వద్ద భారీ గోతిని తీసి కోళ్ల వ్యర్థాలను పూడ్చివేశారు. లారీ డ్రైవర్, యజమాని, అక్రమంగా వ్యర్థాలను తరలిస్తున్న వ్యాపారస్తులపై కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

- వాహనం వదిలేసి డ్రైవర్ పరారీ

కలిగిరి: మండలంలోని వెలగపాడు పంచాయతీలోని కమ్మవారిపాళెం వద్ద ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి కారు ఢీకొన్న ఘటనలో కాపా వీరరాఘవయ్య (65) అనే వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కమ్మవారిపాళేనికి చెందిన వీరరాఘవయ్య కలిగిరికి వెళ్లాడు. పని ముగించుకుని బస్సులో సొంతూరికి బయలుదేరాడు. బస్సు దిగి గ్రామంలోకి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా సంగం నుంచి కలిగిరి వైపు వెళ్తున్న కారు వేగంగా రాఘవయ్యను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు డ్రైవర్ తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో వాహనాన్ని పొగాకు వేలం కేంద్రం సమీపంలోని పొలాల్లోకి తీసుకెళ్లాడు. వర్షానికి ఆ దారి బురదమయమై కారు ఇరుక్కుపోయింది. దాంతో దిగి పరారయ్యాడు. గ్రామస్తులందరూ ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కలిగిరి సీఐ వెంకటనారాయణ, ఎస్సై ఉమాశంకర్ వివరాలు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మినీ మహానాడుకు వెళ్తుండగా..

- విద్యుదాఘాతానికి గురై యువకుడి మృతి
- తండ్రి కళ్లెదుటే ఘటన


చిన ఓబులరెడ్డి మృతదేహం

వింజమూరు(ఉదయగిరి): ఆ యువకుడు ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఈ క్రమంలో సెలవులని ఇంటికొచ్చాడు. వింజమూరులో జరుగుతున్న టీడీపీ మినీ మహానాడుకు తండ్రితో కలిసి బయలుదేరాడు. మార్గమధ్యలో సరుకుల కొనుగోలుకు ఓ దుకాణం వద్దకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు.. దుత్తలూరు మండలం భైరవరం గ్రామానికి చెందిన భోగిరెడ్డి ఓబులరెడ్డి, రమణమ్మ రెండో కుమారుడు చిన ఓబులరెడ్డి (23) తిరుపతిలోని ఓ కాలేజీలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. నేవీ ఉద్యోగం కోసం ఇటీవల జరిగిన ఫిజికల్ టెస్ట్‌లో పాస్ అయ్యాడు. బుధవారం పరీక్ష రాయాల్సి ఉంది. ఆదివారం సెలవు కావడంతో స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం వింజమూరులో టీడీపీ మినీ మహానాడుకు తండ్రితోపాటు బయలుదేరాడు. దారిలో సరుకుల కొనుగోలు కోసం వింజమూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఓ దుకాణం వద్ద ఆగారు. దుకాణం రేకులకు ఆధారంగా వేసి ఉన్న ఇనుప స్తంభానికి అప్పటికే విద్యుత్ సరఫరా అవుతోంది. ఇది తెలియక చిన ఓబులరెడ్డి సంభాన్ని పట్టుకోగా షాక్‌కు గురై స్పృహ కోల్పోయాడు. వెంటనే అక్కడ ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వైద్యశాలకు వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ట్రాన్స్‌కో ఏఈ నాగూర్‌వలీ మాట్లాడుతూ షాపు ఓనర్ నిర్లక్ష్యం కారణంగా ఈ ఘటన జరిగినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యజమాని నిర్లక్ష్యమే కారణమా?

నాలుగు నెలల నుంచి వర్షం వచ్చిన ప్రతిసారి దుకాణం వద్ద ఉన్న రేకులకు సపోర్టుగా ఉన్న ఇనుప స్తంభానికి విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ విషయం అక్కడ పనిచేసే కూలీలు యజమానికి పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదని చెబుతున్నారు.